క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సన్‌సిటీ, పిఅండ్‌టి కాలనీ, ఏ,బీ,సీ,డీ బ్లాక్స్, స్పెషల్ బ్లాక్, మెపాల్‌టౌన్, కార్తీ రిచ్‌మండ్ విల్లా, హైదర్ ఎన్‌క్లేవ్, హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, బృందావన్ కాలనీ, పావనీ హార్మనీ, బండ్లగూడ, తిరుమల గార్డెన్ తదితర ప్రాంతాలలో ఈ కోత ఉంటుందన్నారు.

బీసీ బంధు చెక్కుల పంపిణీ

బండ్లగూడ: దేశంలోనే ఎక్కడ లేధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతున్న ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌కే దక్కుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో బీసీ బంధు లబ్ధిదారులకు 23 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటుపడుతున్నారన్నారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

బండ్లగూడ: ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోని మెరుగైన వసతులు కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 3,10,19,22 డివిజన్‌లలో రూ.3.43 కోట్ల వ్యయంతో పలు కమ్యూనిటీహాల్స్, పార్కులను ప్రారంభించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తున్నామన్నారు. కమీషనర్ శరత్‌చంద్ర పాల్గొన్నారు.

32 గ్రాముల కొకైన్ పట్టివేత

నలుగురు అరెస్ట్

గచ్చిబౌలి: కొకైన్ తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు. మణికొండలో నివాసం ఉండే తోట క్రాంతికిరణ్(45) స్థానికంగా నివాసం ఉండే నరేష్ గోపిశెట్టి(36) వద్ద 32 గ్రాముల కొకైన్ కొనుగోలు చేస్తుండగా మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నరేష్‌ను విచారించగా తన సోదరుడు రాజేష్ గోపిశెట్టి (38)నుంచి కొకైన్ తీసుకున్నట్లు వెల్లడించారు. రాజేష్‌ను విచారించగా హఫీజ్‌పేట్‌లో నివాసముండే రాజమండ్రికి చెందిన డ్రగ్ పెడ్లర్ బొమ్మదేవర వీరరాజు(29) నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తరచుగా వీరరాజు గోవాకు వెళ్లి డ్రగ్స్ రవాణ చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్శిటీలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ సలాఉద్దీన్ 'భారతీయ విశ్వవిద్యాలయాల్లో ఇస్లామిక్ అధ్యయనాలు: ఒక విశ్లేషణాత్మక అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆయన ఇస్లామిక్ స్టడీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి ఇర్ఫాన్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ దెబ్బకు బీఆర్ఎస్ ఖతం అని బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయనను సోమవారం బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్ ఆయనకు శాలువా కప్పి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్ ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థికంగా దివాలా తీసిందని రాష్ట్ర ఆదాయం కంటే ఎన్నో రెట్ల అప్పులే ఉన్నాయని ఆయన ఆరోపించారు. మరో వైపు మంత్రి కేటీఆర్ తెలంగాణలో విదేశీ సంస్థలు వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నాయంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, అనూయాదవ్, మాణిక్‌ప్రభు, కట్ల అశోక్ పాల్గొన్నారు.





శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మినీ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మాటిచ్చాం.. నిలబెట్టుకున్నాం

- ఎంపీ డాక్టర్ రంజింత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రతి ఇంటికి తాగునీటిని ఇస్తామని ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలుపుకున్నామని ప్రజలు మరో సారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజింత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌లు పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో రూ.3.86కోట్లతో 2లక్షల లీటర్ల రిజర్వాయర్, గండిపేట తహసీల్దార్ కార్యాలయం ముందు రూ. 13.35కోట్లతో 2లక్షల లీటర్ల రిజర్వాయర్, పైప్‌లైన్‌లు, బృందావన్ కాలనీలో రూ.7.42 కోట్లతో నిర్మించిన 2.50లక్షల లీటర్ల రిజర్వాయర్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇంటింటికి నీటిని తాగిస్తేనే ఓటు వేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్టుగానే ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజావసరాలకు అనుగుణంగా కొత్త రిజర్వాయర్‌లను నిర్మించామన్నారు.

రూ. 50 కోట్ల పనులకు శంకుస్థాపనలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు రంజిత్‌రెడ్డి, రాజేంద్ర ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్‌లు అన్నారు.గత నాలుగేళ్లలో వందకోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు శంషాబాద్ పట్టణంలో చేపట్టడం జరిగిందన్నారు. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా నిదులు అందజేస్తోందన్నారు. హెచ్ఎండీఏ నుంచి విడుదలైన రూ. 50 కోట్ల నిధులతో పట్టణంలో ప్రధానంగా ఉన్న మౌలిక సమస్యలకు దాదాపుగా పరిష్కరించుకునేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలతో పాటు క్రీడా రంగాన్ని అభివృద్ధి పరిచే విధంగా ముందుకు సాగుతోందని చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ ఇండోర్ స్టేడియాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,బీజేపి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభిచారు. ఇండోర్ స్టేడియంలో ఇరువురు కలిసి షెటిల్ ఆడారు. క్రీడా రంగంలో యువతకు మంచి భవిష్యత్తు ఉన్నదని అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ..స్టేడియం నిర్మాణం పూర్తి కావడానికి అనేక నిధులు మంజూరు చేయించానని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచినీటి రిజర్వాయర్ ట్యాంకుల ప్రారంభం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేరుస్తుందని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9,18వ డివిజన్‌లలోని ఎర్రకుంట, బైరాగిగూడలలో మంచినీటి రిజర్వాయర్ ట్యాంకులను ప్రారంభించారు. జలమండలి ఆధ్వర్యంలో ఈ ట్యాంకులను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారన్నారు. ప్రజల మంచి నీటి కష్టాలు తీర్చేందుకు 4.86 కోట్లతో మంచినీటి రిజర్వర్ ట్యాంకులను నిర్మించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమీషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

మణికొండ: రాష్ట్ర అభివృద్ధికి 9 సంవత్సరాలలో రూ. 9లక్షల కోట్ల నిధులను కేటాయించటం, రాష్ట్రానికి పసుపుబోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం, కృష్ణానదిలో 33 శాతం నీటిని కేటాయించేందుకు ఆదేశాలు ఇవ్వటంతో సోమవారం మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుకు అప్పట్లో పార్లమెంట్‌లో సుష్మస్వరాజ్ పూర్తి స్థాయిలో మద్దతు తెలపటంతోనే సాధ్యం అయ్యిందన్నారు. కౌన్సిలర్లు వందన నగేష్, శ్వేత రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

బండ్లగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధిలో దూసుకుపోతోందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు కొండె మహేష్‌యాదవ్ అన్నారు. పసుపు బోర్డు, గిరిజన విశ్వవిద్యాలయం, కృష్ణా నీళ్ల ట్రిబ్యునల్, 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఏర్పాటుకు సంతోషం వ్యక్తం చేస్తూ కాళీమందిర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పసుపు, పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోకన్వీనర్ మహాలింగం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తు బస్తీ దావాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ పిఅండ్‌టి కాలనీలో కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్‌తో కలిసి బస్తీ దావాఖానాను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాలపై జాగ్రత్తలు వహించాలన్నారు. కమీషనర్ శరత్‌చంద్ర, పిఏసిఎస్‌చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గోశరి సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నాయకులు సుమాన్‌గౌడ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్

ఉద్రిక్తంగా మారిన విద్యార్థుల ధర్నా





రోడ్డు పై బైఠాయించిన ఉద్యాన విద్యార్థులు, విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఏజీవర్సిటీ: ఉద్యాన శాఖలో ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తరణ అధికారుల నియమాకలు చేపట్టాలని ఉద్యాన విద్యార్థులు చేస్తున్న ధర్నా 6వ రోజుకు చేరింది. విద్యార్థులు, కళాశాల నుంచి అత్తాపూర్ రోడ్డు పైకి వచ్చి ధర్నా చేపట్టారు. వాహనాలు ఎక్కడివి అక్కడ నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అరెస్టు చేసిన మా విద్యార్థులకు విడుదల చేయాలని విద్యార్థులు కళాశాల ముందుకు కూర్చుని సాయంత్రం వరకు ధర్నా చేశారు. ఉద్యాన విద్యార్థులను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు రాకుండా దూరంగా ఉన్న పోలీస్ స్టేషన్ తరలించారు.

షాపుపై దాడి చేసి తగులబెట్టారు



డెయిరీఫామ్ ధ్వంసమైన దృశ్యం

- డెయిరీఫామ్ ధ్వంసం చేసిన రౌడీషీటర్, అతని అనుచరులు
- మంటలను ఆర్పేసిన అగ్నిమాపక సిబ్బంది

అత్తాపూర్: అత్యాచార ఘటనలో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తనకు జైలు శిక్ష పడిందన్న కక్షతో డెయిరీ షాపుపై దాడి చేసి అడ్డు వచ్చిన వారిపై దాడి చేస్తూ డెయిరీషాపును తగలబెట్టి పారిపోయిన సంఘటన సోమవారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నాగరాజు తెలిపిన మేరకు.. జిర్రా ప్రాంతానికి చెందిన జాఫర్ (30) డెయిరీఫామ్ చౌరస్తాలో డెయిరీఫామ్‌ను నిర్వహిస్తున్నాడు. అక్బర్ హిల్స్ ప్రాంతానికి చెందిన ఖూనీ గౌస్ పలు దొంగతనాలు, దోపిడీలు, గొడవలకు కారణం కావడంతో రౌడీషీట్‌ను ఓపెన్ చేశారు. ఖూనీ గౌస్ సాలార్ జంగ్ మ్యూజియంలో బంగారు టిఫిన్ బాక్స్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి శిక్ష అనుభవించి వచ్చాడు. పాల వ్యాపారం చేసుకుంటున్న జాఫర్ వద్ద వ్యసనాలకు బానిసైన ఖూనీ గౌస్ అప్పుడప్పుడు అవసరాలకు డబ్బులు తీసుకుంటాడు. పాల వ్యాపారం చేసుకుంటున్న జాఫర్ ఇటీవల ఖూనీ గౌస్‌కు అప్పనంగా డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో పాటు అత్యాచార ఘటనలో తనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జాఫర్‌పై కక్ష పెంచుకున్న ఖూనీ గౌస్ ఐదు మంది అనుచరులతో సోమవారం డెయిరీఫామ్ వద్ద వచ్చాడు. అదే సమయంలో జాఫర్ తన బావ షౌకత్‌ను ఫామ్‌లో ఉంచి ఇంటికి వెళ్లాడు. దీంతో ఖూనీ గౌస్ షౌకత్‌ను బెదిరిస్తూ జాఫర్‌ను పిలువాలంటూ గొడవకు దిగాడు.

ఈ క్రమంలో షాపులోని పాల ఉత్పత్తులు, పాలు పడేస్తూ స్థానికంగా హంగామా సృష్టిస్తూ షాపును తగలబెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న జాఫర్ అక్కడికి చేరుకున్నాడు. దీంతో జాఫర్‌పై ఖూనీ గౌస్ వెంట వచ్చిన అనుచరులు దాడి చేసి పారిపోయారు. దీనిపై సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, అత్తాపూర్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సిబ్బందితో వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షౌకత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హీరోయిన్ మెహ్రీన్ సందడి

గచ్చిబౌలి: కొండాపూర్‌లో ఇమ్మడి సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా సినీహీరోయిన్ మెహ్రీన్ పీర్జాదా, బుల్లి తెర నటీమణులు సంద్రజై చంద్రన్, ఐశ్వర్య సందడి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బిగాల గణేష్, ఇమ్మడి సిల్వర్ జువెలరీ వ్యవస్థాపక చైర్మన్ రమేష్ ఇమ్మడి, ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలి



విద్యుత్ శాఖ డీఈని కలిసిన జూనియర్ లైన్‌మెన్లు

మణికొండ: విద్యుత్ శాఖలో ఉద్యోగం కత్తి మీద సాములాంటిదని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డీఈ శివశంకర్ అన్నారు. విద్యుత్ శాఖలో కొత్తగా చేరిన 17 మంది జూనియర్ లైన్ మెన్‌లు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఏదైనా సమస్య వస్తే దాన్ని అధిగమించి పరిష్కరించుకునేందుకు స్వతహాగా కృషి చేయాలని, అది సాధ్యం కానపుడు సీనియర్లను సంప్రదించాలన్నారు. 1104 యూనియన్ అదనపు కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రత్నం పాల్గొన్నారు.

బీసీ బంధుతో బీసీలకు చేయూత



చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: బీసీ బంధుతో బీసీలకు ప్రభుత్వం చేయూతనందిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. సోమవారం వైఎస్ఆర్ గార్డెన్‌లో పట్టణంలో ఆయా వార్డుల లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను పంపిణీ చేశారు. వెనకబడిన వర్గాలకు చేయూతనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచే స్తోందన్నారు. కార్యక్రమంలో నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు వై. కుమార్, జహంగీర్‌ఖాన్, అజయ్, కొండ ప్రవీణ్‌గౌడ్, అశోక్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో సోమవారం అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ అభివృద్ధి లక్ష్యంగా రూ.2.7 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అత్తాపూర్ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజల ఆకాంక్ష మేరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అనంతరం బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా ఆమె అగిడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ శంకర్ నాయక్, ఏఈ నరసింహా మూర్తి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ప్రారంభం



లాంగ్ డ్రైవ్ తీసుకుంటున్న గోల్ఫర్

గోల్కొండ: తెలంగాణ ప్రీమియర్ లీగ్ గోల్ఫ్ టోర్నమెంట్ అట్టహాసంగా ప్రారంభమైంది. గోల్కొండ నయాకీలాలోని హైదరాబాద్ గోల్ఫ్ ఫోర్స్‌లో 3వ సీజన్ ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఎంవైకే స్ట్రైకర్స్, సెలబ్రిటీస్ స్ట్రైకర్స్ మధ్య పోటీ నెలకొంది. ఎవెంజర్స్ టీమ్ 6–2తో కేఎల్ఆర్ కింగ్స్‌ను ఓడించింది. మరో గేమ్స్‌లో ఆటమ్ చార్జర్స్ డెక్కన్ నవాబ్స్‌ను ఓడించింది. కాగా ఈ పోటీలు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి వందిత్‌రెడ్డి అన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: బీసీ కులాలలో ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకుని వారి కుల వృత్తులను అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 33మందికి మంజూరు చేసిన రూ. 33 లక్షల చెక్కులను ఆయన మున్సిపల్ కమీషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లతో కలిసి అందజేశారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న చైర్మెన్, కమిషనర్, వైస్ చైర్మెన్

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శంషాబాద్: పట్టణంలోని కాముని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మన్యం తెలిపిన మేరకు.. ఐదురోజుల క్రితం చెరువులో పడిన వ్యక్తి (35) మృతదేహం తేలియాడుతుండడంతో స్థానిక జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్లైఓవర్‌పై...

పట్టణంలోని ప్యారడైజ్ ఎదురుగా ఫ్లై ఓవర్‌పై ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 30 వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతిచెందినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు దొంగ రిమాండ్

రాజేంద్రనగర్: కిరాణా షాపునకు వెళ్లి వస్తున్న వెలుతున్న వృద్ధురాలి మెడలోని 40గ్రాముల బంగారు గొలుసును దొంగిలించిన వ్యక్తిని నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపిన మేరకు.. పుప్పాలగూడ, బాలాజీనగర్ కాలనీకి చెందిన పెమ్మరాజు వేదవతి అక్టోబరు 5వ తేదీన సాయంత్రం గోల్డన్‌టెంపుల్ సమీపంలోని ఓ కిరాణషాపునకు నడుచుకుంటు వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో ఓ ఆటోలో వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని 40గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. అదే విషయం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విచారణ జరిపిన పోలీసులు ఆదివారం బహదూర్‌పూరలోని అసద్‌బాబ నగర్‌కు చెందిన మహ్మద్ ఇమ్రాన్‌ను అరెస్టు చేశారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ, నార్సింగి ఎస్‌హెచ్‌ఓ శివకుమార్, డీఐ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి